ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
సోమవారం 23 సెప్టెంబరు 2024



తిరునల్వేలి, తెన్‌కాశిలో
భూ ప్రకంపనలు

● వీధుల్లోకి పరుగులు తీసిన ప్రజలు



సింగంపట్టి వద్ద భూమి కంపించడంతో ఇళ్ల బయట కూర్చున్న మహిళలు

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాల్లో ఆదివారం ఉదయం పలుచోట్ల భూప్రకంపనలు రావడంతో ప్రజలు భీతిల్లారు. పలుచోట్ల ప్రాణభయంతో ఇళ్ళ నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. తిరునల్వేలి జిల్లా అంబాసముద్రం తాలూకాలోని పలు ప్రాంతాలు కొండల దిగువన ఉన్నాయి. వీటిలో సింగంపట్టి, జమీన్ సింగంపట్టి, అన్నానగర్, వైరావికుళం, మణిముత్తారు, ఆలడియూరు, ఏర్వాల్‌పురం తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 11.50 గంటలకు పెద్ద శబ్దంతో భూమి కంపించింది. దీంతో ఆ ప్రాంతాల ప్రజలు భయంతో పరుగులు తీశారు. జమీన్‌సింగంపట్టిలో భూప్రకంపనలకు ఇళ్లలో వంటగదుల్లోని పాత్రలు నేలపై పడ్డాయని స్థానికులు తెలిపారు. వీకే పురం వద్దనున్న కీళ్ ఆంబూరు గ్రామంలోని కొన్ని ఇళ్లలో స్లాబ్‌లపై ఉంచిన సామగ్రి నేలపై జారి పడింది. ఇదే విధంగా అంబై ప్రాంతం వద్ద బాంబు పేలినట్టు శబ్దం వినపడినట్లు స్థానికులు చెప్పారు. ముక్కూడల్ నుండి సుద్దమల్లి దాకా భూమి కంపించిందని ఆ ప్రాంతీయులు చెబుతున్నారు.

తెన్‌కాశిలో...

తెన్‌కాశి జిల్లాలోని కడయం, పొట్టల్‌పుదూరు, ముదలియార్‌పట్టి, ఆళ్వార్‌కురిచ్చి, వాగైకుళం, కల్యాణిపురం తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. ఇదే రీతిలో పడమటి కనుమలకు చేరువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోనూ భూమి కంపించిందని, ఇళ్ళలోని వస్తువులు కదిలాయని చెప్పారు. ఇదిలా ఉండగా తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాల్లో రాళ్ల క్వారీలు అధికంగా ఉన్నాయని, ఆ క్వారీల్లో బాంబులుపయోగిస్తుంటారని, ఆ కారణంగానే ఆదివారం ఉదయం భూ ప్రకంపనలు చోటచేసుకుని ఉంటాయని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

నేడు బంగాళాఖాతంలో
అల్ప వాయుపీడనం

● రాష్ట్రానికి వర్షసూచన

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో సోమవారం అల్పవాయుపీడనం ఏర్పడనుండటంతో రాష్ట్రంలో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించింది. ఈ అల్పవాయుపీడనం వాయుగుండంగా మారే అవకాశం కూడా ఉందని పేర్కొంది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ తదితర ప్రాంతాల్లో మరి రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని, ఆ సమయంలో గంటలకు 30 నుండి 40 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయని హెచ్చరించింది. నగరానికి సంబంధించినంతవరకూ ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని చోట్ల ఉరుములు మెరుపులతో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని ఆ కేంద్రం అధికారులు తెలిపారు.

పురటాసి మాసం..
● కిక్కిరిసిన తిరుచెందూరు, పళని ఆలయాలు
● దర్శనానికి 4 గంటలు ● క్యూలైన్లలో భక్తుల పడిగాపులు
మురుగన్ ఆలయాల్లో రద్దీ

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం మురుగప్పెరుమాన్ కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవ క్షేత్రం తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయం, తృతీయ క్షేత్రం పళని దండాయుధపాణి ఆలయం. ఈరెండు ఆలయాలు ఆదివారం వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన వేలాదిమంది భక్తులతో కిటకిటలాడాయి. దీంతో స్వామి వారిని దర్శించటానికి భక్తులు నాలుగు గంటలపాటు క్యూలైన్లో వేచి ఉండాల్సి వచ్చింది.



తిరుచెందూరు ఆలయంలో భక్తులు

పళని ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి, విదేశాల నుండి కూడా విపరీతంగా భక్తులు తరలివస్తున్నారు. ఈ క్షేత్రంలో కొద్ది రోజులకు ముందు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ముత్తమిళ్ మురుగన్ మహానాడు రెండు రోజులపాటు నిర్వహించడంతో అంతర్జాతీయ ఖ్యాతిని సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం తమిళ మాసమైన పురటాసి కృత్తిక పర్వదినం కావటంతో శనివారం సాయంత్రమే వివిధ జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పళని క్షేత్రానికి తరలివచ్చారు. ఆదివారం వేకువజాము నుంచే బస్‌స్టేషన్, కొండదిగువ ప్రాంతం, గిరివీథి తదితర ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయింది. మెట్ల రహదారి, ఏనుగుల దారి, వించ్‌స్టేషన్ ప్రాంతం, రోప్‌కార్ ప్రాంతం తదితర ప్రాంతాల్లోనూ భక్తుల రద్దీ పెరిగింది. పర్వాతాలయం వద్ద భక్తులు గుమికూడారు. సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. సర్వదర్శనానికి సుమారు నాలుగు గంటలు పట్టింది. వేకువజామునే పళని పర్వతాలయం చుట్టూ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వాహనాలను నిలుపటంతో ట్రాఫిక్ రద్దీ పెరింది. భక్తుల సౌకర్యార్థం మదురై, దిండుగల్, తిరుప్పూరు. కోయంబత్తూరు తదితర నగరాల నుండి అధిక సంఖ్యలో రాష్ట్ర రవాణా సంస్థ బస్సులను నడిపారు.

తిరుచెందూరులో...

సుప్రసిద్ధ పరిహార శైవక్షేత్రం తిరుచెందూరులోనూ శనివారం సాయంత్రం నుండే భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం పురటాసి కృత్తిక కావటంతో వివిధ జిల్లాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. వేకువజామునే సముద్రతీరంలో స్నానమాచరించి, ఆ తర్వాత నాళి కినరులో పుణ్యస్నాన మాచరించిన భక్తులు సెంథిల్ ఆండవర్‌ను, శత్రుసంహార షణ్ముఖస్వామిని దర్శనం చేసుకునేందుకు సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో బారులు తీరారు. కృత్తిక సందర్భంగా ఆయలంలో వేకువజాము నాలుగు గంటలకు ఆలయాన్ని తెరిచారు. 4.30 గంటలకు విశ్వరూపదర్శనం, ఉదయం ఆరుగంటలకు ఉదయమార్తాండ అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వదర్శనం క్యూలైన్ భక్తులు ఈ స్వామివారిని దర్శించడానికి సుమారు రెండు గంటలు పట్టింది.



పళని పర్వతాలయం చుట్టూ కిటకిటలాడుతున్న క్యూలైన్లు

బీజేపీలో ఎవరైనా ఉన్నత పదవి పొందొచ్చు

● కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్



కొట్టివాక్కంలో ఓ మహిళకు సభ్యత్వ కార్డు అందజేస్తున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

అడయార్, సెప్టెంబరు 22: భారతీయ జనతా పార్టీలో ఎవరైనా ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కొట్టివాక్కంలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఒక రాజకీయ పార్టీకి ప్రధాన రహదారిలో భారీ భవనం, వంద అడుగుల ఎత్తు జెండా దిమ్మెలు ముఖ్యం కాదు. పార్టీకి అవసరమైన పార్టీ కార్యాలయాలను ప్రతి గ్రామంలోనూ నిర్మిస్తామన్నారు. అదే సమయం లో రాజకీయ పార్టీ సిద్ధాంతాలను నమ్మి ఎంతమంది చేరుతారన్న అంశాన్ని బట్టి ఆ పార్టీ పెద్దదా? చిన్నదా? అనేది ఆధారపడివుంటుందన్నారు. బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో ఒకే కుటుంబానికి చెందినవారు అధికారంలో కొనసాగడం లేదన్నారు. పార్టీలోని ప్రతి కార్యకర్తకు అవకాశం ఇచ్చి, వారిని అధ్యక్షులుగా తీర్చిదిద్దుతామని మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

టీవీకే మహానాడు...
పోలీసుల అనుమతి కోరుతూ మళ్లీ దరఖాస్తు



తలరాతను మారుద్దాం అనే నినాదంతో ముద్రించిన పోస్టర్



పెరియార్, అన్నాదురై, ఎంజీఆర్ తర్వాత వారసుడంటూ విజయ్ ఫొటోతో పోస్టర్

ప్యారీస్, సెప్టెంబరు 22: విల్లుపురం జిల్లా విక్రవాండిలో అక్టోబరు 27వ తేది నిర్వహించదలచిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి మహానాడుకు అనుమతి కోరుతూ జిల్లా ఎస్పీ తిరుమాల్‌కు మళ్లీ దరఖాస్తు చేశారు. ప్రముఖ సినీనటుడు విజయ్ ప్రారంభించిన టీవీకే మహానాడు ఈ నెల 23న విక్రవాండి సమీపంలో నిర్వహించేందుకు పోలీసు భద్రత, అనుమతి కోరుతూ గతంలో ఆ పార్టీ నిర్వాహకులు దరఖాస్తు చేశారు. పరిశీలించిన పోలీసు శాఖ, 33 నిబంధనలతో మహానాడుకు అనుమతించింది. అయితే పోలీసులు విధించిన నిబంధనలు పాటించడం అంత సులువు కాదని, అందుకు సమయం కూడా లేకపోవడంతో మహానాడు వాయిదాపడింది. ఈ నేపథ్యంలో, న్యాయ నిపుణుల సలహా మేరకు అక్టోబరు 27న మహానాడు నిర్వహించనున్నట్లు విజయ్ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో, మహానాడు తేది మార్చడం వల్ల పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ నేతృత్వంలో నేతలు మహానాడుకు అనుమతి కోరుతూ శనివారం సాయంత్రం విల్లుపురం జిల్లా ఎస్పీ తిరుమాల్‌కు దరఖాస్తు సమర్పించారు.

పోస్టర్ల కలకలం...

ఇదిలా ఉండగా టీవీకే మహానాడు సందర్భంగా విల్లుపురం జిల్లా అంతటా ఆ పార్టీ స్థానిక నాయకులు వేయించిన పోస్టర్లు కలకలం సృష్టిస్తున్నాయి. రాష్ట్ర తలరాతను తిరగరాద్దాం రండి అంటూ విక్రవాండి అంతటా పోస్టర్లను అతికించారు. మరో పోస్టర్‌లో పెరియార్, అన్నాదురై, ఎంజీఆర్ పక్కనే విజయ్ ఫొటో ముద్రించి ఉంది. ఆ పోస్టర్‌లోనే కాబోయే రాజకీయ వారసుడు విజయ్ అంటూ ప్రధాన రాజకీయ పార్టీల కార్యకర్తలకు ఆగ్రహం తెప్పించేలా ముద్రించి ఉంది. పెరియార్, అన్నాదురై, ఎంజీఆర్ తర్వాతి వారసుడు తానేనని చెప్పేలా ఆ ముగ్గురు దివంగత నేతల వరుసలో విజయ్ ఫొటో చూసి అన్నాడీఎంకే, డీఎంకే కార్యకర్తలు సైతం ఆగ్రహిస్తున్నారు.

కాంగ్రెస్‌లో
లుకలుకలు

● సెల్వపెరుంతగైపై పెరుగుతున్న అసంతృప్తి...!

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగైకి సంబంధం ఉన్నట్లు ఆ పార్టీ నేతలంతా ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయనను పదవి నుంచి తొలగించాలంటూ అసమ్మతి నేతలు హస్తిన వెళ్ళి అధిష్టానంపై ఒత్తిడి చేస్తున్నారు. మూడు నెలల క్రితం జరిగిన ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో బీజేపీ, కాంగ్రెస్, అన్నాడీఎంకే, డీఎంకే, టీఎంసీ తదితర రాజకీయ పార్టీల వారు సహా మొత్తం 28 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఓ రౌడీ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అంతే కాదు ఈ హత్యకేసులో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేత అశ్వత్థామన్ అరెస్టయి ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఈ పరిస్థితులలో ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో సెల్వపెరుంతగైకి సంబంధాలున్నాయంటూ ఉన్నట్టుండి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయనను పదవి నుండి తొలగించాలని కోరుతూ బీఎస్పీ ప్రధాన కార్యదర్శి జయశంకర్ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. ఆ లేఖ వివరాలు వెల్లడైనప్పుడు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జులు అజయ్‌కుమార్, సూరజ్‌హెగ్డే చెన్నైలోనే టీఎన్‌సీసీ కార్యాచరణ మండలి సమావేశంలో ఉన్నారు. బీఎస్పీ ఆరోపణలపై వీరిద్దరూ విచారణ జరిపి అధిష్టానానికి నివేదిక కూడా పంపారు. అయితే టీఎన్‌సీసీ కార్యాచరణ మండలి సమావేశం జరుగుతున్నప్పుడు దురుద్దేశ పూరితంగా బీఎస్పీ నేతలు సెల్వపెరుంతగైపై అవాస్తవమైన ఆరోపణలు చేశారంటూ విమర్శించారు. తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా ఆమ్‌స్ట్రాంగ్ హత్యతో తనకు సంబంధం ఉందంటూ ఆరోపించిన బీఎస్పీ నేతపై రూ.100 కోట్ల నష్టపరిహారం చెల్లించాలంటూ సెల్వపెరుంతగై పరువు నష్టం దావా వేశారు. చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని కూడా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని ప్రధాన ప్రతిపక్షాలు తమకు అందివచ్చిన అవకాశంగా భావించి సెల్వపెరుంతగైని పోలీసులు విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నాయి. బీజేపీ రాష్ట్ర సమన్వయ కమిటీ అధ్యక్షుడు హెచ్.రాజా కూడా టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగైని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై కూటమి నాయకుడైన డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను సెల్వపెరుంతగై కలుసుకుని వివరణ ఇచ్చారని తెలుస్తోంది. సెల్వపెరుంతగైపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను టీఎన్‌సీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని అసంతృప్త వాదులంతా కలిసి అధిష్టానంపై ఒత్తిడికి దిగారు. పార్టీ సీనియర్ నేతలు, కొంతమంది ఎంపీలు కూడా బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసుతో సంబంధాలున్నాయంటూ వచ్చిన ఆరోపణలను తేలికగా భావించకూడదని, నిజానిజాలేమిటో తెలుసుకునేంతవరకూ సెల్వపెరుంతగైని టీఎన్‌సీసీ పదవి నుండి తొలగించడం పార్టీకి అన్ని విధాలా శ్రేయస్కరమని ఢిల్లీ నేతలకు ఫోన్ చేసి మరీ తెలిపారు. ఇక ఎప్పటి నుంచో టీఎన్‌సీసీ అధ్యక్ష పదవి కోసం అర్రులు చాస్తున్న మాజీ నేతలు కూడా ఇదే అనుకూల సమయమని భావించి సెల్వపెరుంతగైని తొలగించాలంటూ అధిష్టానానికి ఆయనపై లేనిపోని ఆరోపణలు కూడా నివేదిస్తున్నట్లు సమాచారం.

ఇది కుట్రే...

నాలుగు దశాబ్దాల తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పీఠంపై దళితుడైన సెల్వపెరుంతగై కూర్చోవడం సహించలేకే బీఎస్పీ నేతలు అవాస్తవమైన ఆరోపణలతో ఆయనను పార్టీ పదవి నుంచి దింపేందుకు కుట్రపన్నుతున్నారంటూ టీఎన్‌సీసీ ఉపాధ్యక్షుడు ఇమయా కక్కన్ ఆరోపించారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్య జరిగి వివిధ పార్టీలకు చెందిన నేతలు సహా 28 మంది అరెస్టయిన నేపథ్యంలో ఉన్నట్టుండి సెల్వపెరుంతగైని ఆ హత్యకేసులో ఇరికించడం భావ్యమేనా అని ఆయన ప్రశ్నించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పీబీ శ్రీనివాస్

● 94వ జయంతి వేడుకలో వక్తలు



పీబీఎస్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన కుమారుడు సహా అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, సెప్టెంబరు 22: సువర్ణ గళంగా గుర్తింపు పొందిన దివంగత ప్రముఖ చలనచిత్ర నేపథ్యగాయకుడు ప్రతివాది భయంకర శ్రీనివాస్ (పీబీ శ్రీనివాస్) బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు వక్తలు కొనియాడారు. టి.నగర్‌లోని ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ (ఆస్కా) ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్, డా.పీబీ శ్రీనివాస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పీబీఎస్ 94వ జయంతి వేడుకలు జరిగాయి. ప్రార్థనాగీతం, జ్యోతి ప్రజ్వలనతో ఆరంభమైన సభలో కళాసుధ వ్యవస్థాపక అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ స్వాగతోపన్యాసం చేస్తూ లెజెండ్ పీబీఎస్ జయంతి రోజున కళాకారులు, ప్రముఖులను సత్కరించే అవకాశం లభించడం మహాభాగ్యమన్నారు. పీబీఎస్ పెద్ద కుమారుడు డా.పీబీ ఫణింద్ర్ తమ తండ్రి జీవిత విశేషాలు గురించి మాట్లాడుతూ... పీబీఎస్ అంటే పద్మభూషణ్, నేపథ్యగాయకుడు, పెన్, బుక్స్, సాంగ్స్, పరబ్రహ్మ స్వరూపంగా భావించవచ్చని, ఆయన తెలుగింట పుట్టినప్పటికీ తమిళం, కన్నడ, హిందీ, మలయాళ తదితర భాషల చిత్రాల్లో ఎన్నో మధురమైన గీతాలు ఆలపించారన్నారు. అందువల్లే శ్రోతలే కాకుండా సాహితీ వేత్తలు కూడా ఆయనను ఎంతగానో అభిమానించారని, ఇది తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ముఖ్య అతిథి సాలూరి వాసూరావు మాట్లాడుతూ... పీబీఎస్ రాసిన గజల్స్ ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. సుమారు 3 వేలకు పైగా పలు భాషల చిత్రాల్లో పాటలు పాడి అందరి మనసుల్లో చెరగని ముద్రవేసుకున్నారని, అంతటి మహానుభావుడిని సంగీత దర్శకులు, గాయకులు మరచిపోవడం బాధాకరమన్నారు. ఈ వేడుకలో అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు సీఎంకే రెడ్డి మాట్లాడుతూ... బహుభాషా కోవిదులు డా.పీబీఎస్‌ను కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోవడం దురదృష్టకరమని, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్మార్ సుబ్రహ్మణ్యం, పీబీఎస్ తెలుగు, తమిళంలో పాడిన పాటలను ఆలపించారు. ఈ వేడుకలలో 15 మంది దివ్యాంగులు పీబీఎస్ పాటలు ఆలపించి శ్రోతలను మైమరపించారు. నిర్వాహకులు వారిని ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

సమాచార దర్శిని

30న తపాలా గ్రీవెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 22: స్థానిక అన్నాసాలైలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఈ నెల 30వ తేది గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు తపాలా ప్రధానాధికారి దివ్య చంద్రన్ విడుదల చేసిన ప్రకటనలో... తపాలా డెలివరీ జాప్యం, స్పీడ్ పోస్ట్, మనియార్డర్ సహా తపాలా శాఖ అందిస్తున్న సేవలపై ప్రజలు ఈ నె 29వ తేదిలోగా లేఖ రాసి పరిష్కరించుకోవచ్చు. ప్రజలు తమ లేఖలు 'దివ్య చంద్రన్, తపాలా ప్రధానాధికారి, ప్రధాన తపాలా కార్యాలయం, అన్నాసాలై, చెన్నై -600002' అనే చిరునామాకు పంపించాలి. తపాలా కవరుపై 'తపాలా గ్రీవెన్స్' అని తప్పక రాయాలని అధికారి దివ్య చంద్రన్ తెలిపారు.

తాంబరంలో 65 టన్నుల చెత్త తొలగింపు

పెరంబూర్, సెప్టెంబరు 22: తాంబరం కార్పొరేషన్‌లో శనివారం మాస్ క్లీనింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొని, బస్టాండ్లు, రోడ్లు, కాలువలు సహా పలు ప్రాంతాల్లో సుమారు 65 టన్నుల చెత్త, వ్యర్థాలు తొలగించారు. ఇళ్లలో పోగయ్యే చెత్తను రోడ్డుపై కాకుండా ఇళ్ల వద్దకే వచ్చే పారిశుధ్య కార్మికులకు అందించాలని ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆలందూర్ మెట్రోలో అదనపు పార్కింగ్ సదుపాయం

పెరంబూర్, సెప్టెంబరు 22: స్థానిక ఆలందూర్ మెట్రో రైల్వేస్టేషన్ ప్రాంగణంలో అదనపు పార్కింగ్ సదుపాయం కల్పించారు. స్టేషన్ సమీపంలో ఎంజీఆర్ విగ్రహం వెనుక వైపునున్న ఈ ప్రాంతంలో అదనంగా 300 ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసుకోవచ్చని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది.

తగ్గుతున్న మేట్టూరు డ్యాం నీటిమట్టం

పెరంబూర్, సెప్టెంబరు 22: కావేరి పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సేలం జిల్లా మేట్టూ డ్యాం నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. ఆదివారం ఉదయం డ్యాంలోకి సెకనుకు 1,478 ఘనపు టడుగుల నీరు వస్తుండగా, డెల్టా జిల్లాల సాగుకు 20,700 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 103.64అడుగులు (పూర్తి సామర్థ్యం 120 అడుగులు) అని 69.64 టీఎంసీల నీటినిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

29న లా వర్సిటీ 14వ స్నాతకోత్సవం

పెరంబూర్, సెప్టెంబరు 22: తమిళనాడు డా.అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయ 14వ స్నాతకోత్సవం ఈ నెల 29న జరుగనుంది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ గౌరి రమేష్ విడుదల చేసిన ప్రకటనలో... మే నెలలో నిర్వహించిన చివరి సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు, ఇప్పటివరకు డిగ్రీలు పొందేందుకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈ నెల 27 లోపు దరఖాస్తులు సమర్పించాలని రిజిస్ట్రార్ విజ్ఞప్తి చేశారు.

వైగై నుంచి అదనపు జలాలు విడుదల

పెరంబూర్, సెప్టెంబరు 22: వైగై డ్యాం నుంచి సాగునీటి పరిమాణాన్ని అధికారులు పెంచారు. తేని జిల్లా ఆండిపట్టి సమీపంలో 71 అడుగుల సామర్థ్యంతో ఉన్న వైగై డ్యాం నుంచి మదురై, దిండుగల్, శివగంగ జిల్లాల్లోని భూములకు ఈ నెల 15వ తేది నుంచి సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి నీటి విడుదల పెంచారు. కాలువల్లో నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున, తీర ప్రాంతాల ప్రజలు కాలువలో స్నానాలకు దిగరాదని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది.

ఉపకార వేతనాల రెట్టింపు

● స్వాగతించిన దివ్యాంగులు

అడయార్, సెప్టెంబరు 22: విద్యాభ్యాసం చేస్తున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే ఉపకారవేతనాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ రెట్టింపు చేశారు. దీన్ని తమిళనాడు దివ్యాంగుల సంక్షేమ సంఘం, దివ్యాంగుల సంక్షేమ సంఘాలు స్వాగతించాయి. ఈ సందర్భంగా తమకు ఇచ్చే ఉపకారవేతనాలను రెట్టింపు చేసినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఆయా సంఘాల ప్రతినిధులు వేర్వేరుగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. అంతేకాకుండా, వికలాంగులు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదోన్నతులు పొందేందుకు వీలుగా నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని వారు కోరారు.

ఏటీఎం నుంచి రూ.23 లక్షలు దోపిడీ

పెరంబూర్, సెప్టెంబరు 22: కృష్ణగిరి-కుప్పం జాతీయ రహదారి సమీపంలో కాట్టినాయన్‌పల్లి ఏటీఎంలో శుక్రవారం రాత్రి సిబ్బంది నగదు ఉంచి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని ముఠా ఏటీఎం దగ్గరకు వెళ్లి సీసీ కెమెరాలపై నల్లటి రంగు స్ప్రే చేశారు. అనంతరం గ్యాస్ వెల్డింగ్ ద్వారా ఏటీఎం యంత్రాన్ని బద్దలు కొట్టి రూ.23 లక్షలు దోపిడీ చేసుకెళ్లారు. ఈఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు, దోపిడీకి పాల్పడింది పొరుగురాష్ట్ర ముఠాగా భావిస్తున్నారు.

బాలికపై అత్యాచారం... వృద్ధుడి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 22: పదహేనేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన 64 ఏళ్ల వృద్ధుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. సేలం జిల్లా తలైవాసల్ తాలూకా వీరనూర్ ప్రాంతానికి చెందిన పెరియస్వామి (64) ఏడాది కాలంగా పొన్నారాంపట్టి ప్రాంతంలోని ఓ తోటలో వాచ్‌మాన్‌గా పనిచేస్తున్నాడు. ఈ తోటలో పనిచేసేందుకు వచ్చిన బాలికపై పెరియస్వామి అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. దీంతో, బాలిక మూడు నెలల గర్భం దాల్చినట్టు గుర్తించిన తల్లిదండ్రులు వాలప్పాడి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి పెరియస్వామిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 22: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అలమాది: కీల్‌కొండయూర్, అరక్కంబాక్కం, కల్పాక్కం, తామరైపాక్కం, కదావూర్, వేళచ్చేరి, పాండేశ్వరం, కారనై, పుదుకుప్పం, వానియన్‌సత్రం

రెడ్‌హిల్స్: సేత్తుపాక్కం రోడ్డు, బాలాజీ గార్డన్, పుల్లి లేన్, బైపాస్ రోడ్డు వడకరై, విష్ణు నగర్, గ్రాండ్‌లైన్, కన్నపాళయం, చెంబరంబాక్కం, తీయంపాక్కం, పాడియనల్లూర్, ఎంజీఆర్ నగర్

అడయార్: పాలవాక్కం, కొట్టివాక్కం, శాస్త్రి నగర్, అంబేడ్కర్ వీధి, స్కూల్ రోడ్డు, టీచర్స్ రోడ్డు, నారాయణస్వామి వీధి, భారతీయార్ వీధి, పాలవాక్కంకుప్పం, సీషెల్ అవెన్యూ, జర్నలిస్ట్ కాలని, శ్రీనివాసపురం, న్యూ బీచ్ రోడ్డు, న్యూ బీచ్ రోడ్డు ఎక్స్‌టెన్షన్, కావేరి నగర్ 1 నుంచి 6 వీధులు, తిరువళ్లువర్ నగర్ 1 నుంచి 59 వీధులు, కొట్టివాక్కంకుప్పం, ఈస్ట్ బీచ్ ప్రధాన రోడ్డు (మరుదీశ్వర ఆలయం నుంచి నీలాంగరైకుప్పం వరకు), సౌత్, వెస్ట్, ఈస్ట్ మాడవీధులు

పొలంలో విద్యుత్ కంచె తగిలి... తండ్రీకొడుకులు సహా ముగ్గురి దుర్మరణం

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట సమీపం చిన్నమూక్కనూరు గ్రామంలో శింగారం (40) అనే కూలీ కార్మికుడు నివసిస్తున్నాడు. అతడి కుమారుడు లోకేష్ (15) అక్కడి పాఠశాలలో చదువుతున్నారు. వీరిద్దరూ అడవి జంతువులను వేటాడాలని ఏలగిరి పర్వతానికి వెళ్లేందుకు తమ బంధువైన పెరుమాపట్టు గ్రామానికి చెందిన కరిబిరాన్ (65)తో కలిసి నాటు తుపాకీతో శనివారం రాత్రి బయలుదేరారు. తిరుపత్తూరు సమీపం పెరుమాపట్టు కాళియమ్మన్ కోవిల్ పంచాయతీ యూనియన్ కొండదిగువ ఉన్న పంటపొలంలో నడిచి వెళ్తుండగా ఆ పొలాల్లో కొంతమంది రైతులు విద్యుత్ కంచెలను ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలియని ముగ్గురూ ఓ పొలంలో అడుగుపెట్టగానే విద్యుత్ కంచె తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించారు.ఆదివారం ఉదయం రైతులు పొలానికి వెళ్ళినప్పుడు మృతదేహాలను చూసి వెంటనే కురిసిలాపట్టు పోలీసులకు ఫిర్యా దు చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం ని మిత్తం తిరుపత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల విచారణలో నీది అనే రైతు తన పొలంలో అడవి పందుల బెడద అధికంగా ఉండటంతో పొలం చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. విద్యుత్ స్తంభం నుంచి అక్రమంగా తీగెలను కొక్కేల ద్వారా వేలాడదీసి పంటచుట్టూ వైర్లు ఏర్పాటు చేసినట్టు తెలిసింది.



పొలంలో పడివున్న ముగ్గురి మృతదేహాలు

10 నుంచి చెన్నై-శివమొగ్గ మధ్య విమానసేవలు

పెరంబూర్, సెప్టెంబరు 22: కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ-చెన్నై మధ్య అక్టోబరు 10 నుంచి విమానసేవలు ప్రారంభం కానున్నాయి. వారంలో మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. చెన్నై నుంచి ఉదయం 10.40 గంటలకు బయల్దేరే విమానం మధ్యాహ్నం 12.10 గంటలకు శివమొగ్గ చేరుకుంటుంది. మరుమార్గంలో శివమొగ్గనుంచి సాయంత్రం 4.25గంటలకు బయల్దేరి 5.55గంటలకు చెన్నై చేరుకుంటుంది. ఈ మార్గంలో 72 సీట్ల చిన్న విమానాలు నడుపుతున్నట్లు స్పైస్ జెట్ సంస్థ ప్రకటనలో తెలిపింది.

తిరుచ్చి-బ్యాంకాక్ విమానసేవలు ప్రారంభం

పెరంబూర్, సెప్టెంబరు 22: తిరుచ్చి-బ్యాంకాక్ మధ్య థాయ్ ఎయిర్‌వేస్-ఎయిర్ ఏసియా సంస్థలు సంయుక్తంగా విమానసేవలు ప్రారంభించాయి. తిరుచ్చి నుంచి మలేసియా, సింగపూర్, మస్కట్, దుబాయ్, అబుదాబి, శ్రీలంక తదితర దేశాలకు విమానసేవలు అందుబాటులో ఉన్నాయి. తాజాగా కొత్త టెర్మినల్ ప్రారంభించడంతో మరిన్ని దేశాలకు విమానాలు నడపాలని అధికారులు నిర్ణయించారు. ఆ ప్రకారం, బ్యాంకాక్ నుంచి శనివారం వచ్చిన తొలి విమానానికి అధికారులు స్వాగతం పలికారు. మంగళ, గురు, శనివారాల్లో రాత్రి 10.35 గంటలకు తిరుచ్చి చేరుకొనే విమానం, మళ్లీ 11.05 గంటలకు బయల్దేరి వెళుతుంది. శనివారం రాత్రి బ్యాంకాక్ నుంచి తిరుచ్చి వచ్చిన విమానంలో 46 మంది రాగా, తిరుచ్చి నుంచి బ్యాంకాక్ వెళ్లిన విమానంలో 17 మంది ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు.

మణిముత్తారు జలపాతంలో స్నానాలకు అనుమతి

పెరంబూర్, సెప్టెంబరు 22: తిరునల్వేలి జిల్లా అంబై సమీపంలోని పశ్చిమ కనుమల కొండల్లో ఉన్న మణిముత్తారు జలపాతం వీక్షించేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాలు, పొరుగు రాష్ట్రాల పర్యాటకులు వస్తుంటారు. ఈ జలపాతం సమీపంలో పర్యాటకుల సౌకర్యార్థం జలపాతం సమీపంలో మహిళలు దుస్తులు మార్చుకొనే గది, టాయిలెట్ సౌకర్యం తదితర నిర్మాణాల కారణంగా జలపాతం వద్దకు పర్యాటకులు వెళ్లేందుకు నిషేధం విధించారు. ఈ పనులు పూర్తికావడంతో ఆదివారం నుంచి జలపాతం వద్ద పర్యాటకుల స్నానాలకు అనుమతించినట్లు జిల్లా అటవీ శాఖ అధికారులు తెలిపారు.

కొడైకెనాల్ పర్యాటకులకు కొత్త నిబంధన

వాటర్ బాటిళ్లు ఉపయోగిస్తే రూ.20 జరిమానా

పెరంబూర్, సెప్టెంబరు 22: దిండుగల్ జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌కు వచ్చే పర్యాటకులు 5 లీటర్ల ప్లాస్టిక్ బాటిల్స్ తీసుకొస్తే రూ.20 జరిమానా విధిస్తామని కలెక్టర్ పూంగొడి హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో, కొడైకెనాల్‌కు ప్రతిరోజు వేలాది మంది పర్యాటకులు వస్తుంటారన్నారు. ఈ ప్రాంతాన్ని కాలుష్యరహితంగా రూపొందించేలా పలు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే హైకోర్టు ఉత్తర్వులతో కొడైకెనల్ కొండ ప్రాంతాలకు పర్యాటకులు ప్లాస్టిక్ బాటిళ్లు తీసుకెళ్లడంపై నిషేధం విధించామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ బాటిళ్లు విక్రయించే వ్యాపారులు, ప్రైవేటు వ్యక్తులు, వాటిని తీసుకొచ్చే పర్యాటకులకు బాటిల్‌కు రూ.20 జరిమానా విధించనున్నామన్నారు. ఈ నిబంధన ఆదివారం నుంచి అమలుకు వచ్చిందని కలెక్టర్ తెలిపారు.

డీఎంకే కూటమిలో ఎలాంటి విభేదాలు లేవు

● ఎండీఎంకే ఎంపీ దురై వైగో

ప్యారీస్, సెప్టెంబరు 22: ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలోని కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని ఎండీఎంకే ఎంపీ దురై వైగో తెలిపారు. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో 81వ జన్మదినం సందర్భంగా ఎగ్మూర్‌లోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఆదివారం పుట్టిన ఐదుగురు శిశువులకు దురై వైగో ఉంగరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకే దేశం-ఒకే ఎన్నిక అసాధ్యమని, ఇది భారత రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గవర్నర్ల ద్వారా బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లోని ప్రభుత్వాలకు ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. ప్రజల సంక్షేమాన్ని కాంక్షించిన సీనియర్ కామ్రేడ్ ఆర్.నల్లకన్ను, వైగో వంటి నేతలు ఎన్నికల్లో గెలవలేదని, ఇది తనకు బాధ కలిగించిందన్నారు. డీపీఐ నేత తిరుమావళవన్ మద్యపానీయాలకు వ్యతిరేకంగా నిర్వహించదలచిన మహానాడుకు తమ పార్టీ మద్దతుగా ఉంటుందని దురై వైగో అన్నారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరిట రూ.2.71 కోట్ల మోసం

వేలూరు, సెప్టెంబరు 22: వాణియంబాడి సమీపం మల్లగుంట ప్రాంతానికి చెందిన ప్రదీప్‌కుమార్, జోలార్‌పేట, తిరుపత్తూర్, వాణియంబాడి, నాట్రాంపల్లి ప్రాంతాలకు చెందిన పట్టభద్రులకు న్యూజిలాండ్‌లో ఉద్యోగాలిప్పిస్తామని ప్రకటించాడు. దీంతో సుమారు 44 మంది రూ.2.71 కోట్లు ప్రదీప్‌కుమార్ అందజేసినట్లు తెలిసింది. డబ్బులు ఇచ్చినా ఉద్యోగంపై అతను ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో బాధితులు ఈ నెల 1వ తేది ప్రదీప్‌కుమార్ ఇంటిని ముట్టడించి ఆందోళన చేపట్టారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి ప్రదీప్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

ప్రియుడి కోసం నైజీరియన్ ఖైదీల గొడవ

అడయార్, సెప్టెంబరు 22: నగర శివారు ప్రాంతమైన పుళల్ కేంద్ర కారాగారంలో ఉంటున్న నైజీరియాకు చెందిన ఇద్దరు మహిళా ఖైదీలు ప్రియుడి కోసం వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఒక మహిళ పెదవిని మరో మహిళ కొరికివేసింది. దీంతో ఆ మహిళను ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ జైలులో నైజీరియాకు చెందిన మోనికా (31), కిలార్కా (32) అనే మహిళలు డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో అరెస్టయి ఉంటున్నారు. వీరిద్దరూ కూడా ఒకే వ్యక్తిని ప్రేమిస్తున్నారు. ఈ వ్యక్తి కూడా ఇదే జైలులో డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులోనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తమ ప్రేమికుడి కోసం ఇద్దరు మహిళా ఖైదీలు గొడవ పెట్టుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటన జైలులో కలకలం రేపింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కడయనల్లూరులో ఏనుగుల సంచారం



ఉచ్చమడై తోటలోకి చొరబడుతున్న అడవి ఏనుగులు

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా కడయనల్లూరు సమీపం వడకరై వద్ద ఒకే సారి నాలుగు ఏనుగులు సంచరించడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. వేకువజామున కావల్‌క్కార వీధి, శాంబవర్ కాలనీ తదితర ప్రాంతాల్లోకి వచ్చిన అడవి ఏనుగులు అక్కడున్న కొబ్బరి చెట్లను కూల్చివేశాయి. అదే విధంగా ఉచ్చమడై వద్ద షేక్ హుసేన్ అనే వ్యక్తికి చెందిన తోటలోకి చొరబడ్డాయి. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖఅధికారులు స్థానికులతో కలిసి టపాసులు పేల్చి అడవి ఏనుగులను తరిమికొట్టేందుకు ప్రయత్నించారు.

సౌత్ చెన్నై రౌడీ సీడీమణి అరెస్టు



అరెస్టయిన సీడీ మణి (ఫైల్‌ఫొటో)

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సౌత్ చెన్నైలో పేరుమోసిన రౌడీ సీడీ మణిని ప్రత్యేక పోలీసు దళం అరెస్టు చేసింది. ఇటీవల ఉత్తర చెన్నై వ్యాసార్పాడి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైన రౌడీ కాక్కాతోప్పు బాలాజీ అనుచరుడైన సీడీ మణి పోలీసులకు భయపడి నగరం నుండి పరారయ్యాడు. ఈ నేపథ్యంలో అతడు సేలంలో దాగినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ప్రత్యేక దళం సేలం వెళ్ళి ఆదివారం వేకువజాము సీడీ మణిని అరెస్టు చేసింది. తేనాంపేటకు చెందిన సీడీ మణి సౌత్ చెన్నై ప్రాంతంలో రౌడీగా చెలామణీ అయ్యాడు. కాక్కాతోప్పు బాలాజీతో కలిసి పలు నేరాలకు పాల్పడ్డాడు. అడయార్, సైదాపేట పోలీసుస్టేషన్‌లలో సీడీ మణిపై హత్య, హత్యాయత్నం, దారిదోపిడీ కేసులున్నాయి. రౌడీ కాకముందు మణి సీడీలు అమ్ముకుని బతికేవాడు. ఆ కారణంగానే అతడిని సీడీ మణిగా పిలుస్తున్నారు. సేలంలో అరెస్టు చేసిన అతడిని పోలీసులు నగరానికి తీసుకువచ్చి తీవ్ర విచారణ జరుపుతున్నారు.

కామరాజర్‌తో మోదీని పోల్చడమా

● తమిళిసైపై సెల్వపెరుంతగై ఆగ్రహం



ప్యారీస్, సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించిన దివంగత ముఖ్యమంత్రి కామరాజర్ పాలనతో ప్రధాని నరేంద్ర మోదీ పాలన పోల్చడం భావ్యమేనా అంటూ బీజేపీ నాయకురాలు డా.తమిళిసై సౌందర్‌రాజన్‌పై తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై మండిపడ్డారు. ఇటీవల నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న తమిళిసై ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వంకామరాజర్ పాలనలాగే దేశంలో పాలనచేస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలపై స్పందించిన పెరుందుగై... కాంగ్రెస్ సారథ్యంలో మళ్లీ కామరాజర్ పాలన ఏర్పాటుచేయాలన్న సంకల్పంతో కన్నియాకుమారి నుంచి చెన్నై వరకు పాదయాత్ర చేసిన ఆమె తండ్రి కుమారి అనంతన్ వద్ద కామరాజర్ పాలన గురించి తమిళిసై అడిగి తెలుసుకోవాలన్నారు. కామరాజర్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన హయాంలో రాష్ట్రంలో అన్నిరంగాల అభివృద్ధికి కృషిచేశారని ఆయన నిరాడంబరంగా మచ్చలేని నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయిన వాస్తవాన్ని తమిళిసై గ్రహించాలని విమర్శించారు.

టీవీకే ఆధ్వర్యంలో సహపంక్తి భోజనం





భోజనం వడ్డిస్తున్న టీవీకే నేతలు

వేలూరు, సెప్టెంబరు 22: తమిళగ వెట్రి కళగం (టీవీకే) జిల్లా ప్రధాన కార్యాలయంలో ఆదివారం సహపంక్తి భోజనం నిర్వహించారు. కార్యక్రమంలో టీవీకే జిల్లా ఆర్గనైజర్ ఆర్.వేల్‌మురుగన్, కార్యకర్తల శాఖ అధ్యక్షుడు, శాసనసభ నియోజకవర్గ ఆర్గనైజర్ శ్రీనివాసన్, నిర్వాహకులు ప్రభు, ఇళంగో, విశాలి, ఆరణి నగర అధ్యక్షుడు మురుగన్, సెక్రటరీ మహబూబ్ బాషా, జిల్లా నిర్వాహకులు కోటీశ్వరన్, ఇంతియాజ్ హైదర్, మణికంఠన్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కాలినడక భక్తురాలు మృతి



సరళ మృతదేహం, విషణ్ణ వదనాలతో భక్తులు

పాకాల, సెప్టెంబరు 22: తిరుమల దర్శనానికి కాలినడకన వెళ్తూ గుర్తు తెలియని వాహనం ఢీ కొని తమిళనాడుకు చెందిన భక్తురాలు మృతి చెం దింది. తిరుపతి జిల్లా పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో పాకాల మండల పరిధిలోని శంఖంపల్లె ఆంజనేయస్వామి ఆలయం సమీపాన ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. గుడియాత్తం మండలం నుంచి తిరుమలకు కాలినడకన వెళ్తున్న భక్తుల బృందం ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శనివారం రాత్రి సేదదీరారు. తెల్లవారుజామున తిరిగి కాలినడక ప్రారంభించారు. వీరిలో తమిళనాడు వేలూరు జిల్లా గుడియాత్తం మండలం తాటిమానుపల్లెకు చెందిన సరళ (43)ను గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. తీవ్రగాయాలైన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈమె భర్త జయపాల్‌తో కలిసి 23 ఏళ్లగా కాలినడకన తిరుమలకు వెళ్లి దర్శనం చేసుకునేవారు. కళ్లముందే భార్య దుర్మరణం చెందడంతో భర్త జయపాల్ కన్నీరుమున్నీరు అయ్యారు. సీఐ మద్దయ్యాఆచారి, ఎస్సై మహేష్‌బాబు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు తిరిగిచ్చేందుకు నిరాకరణ

● మనస్తాపంతో దంపతుల ఆత్మహత్య

వేలూరు, సెప్టెంబరు 22: అప్పు తిరిగిచ్చేందుకు నిరాకరించడంతో మనస్తాపం చెందిన దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. స్థానిక సలవన్‌పేట శేషాలం వీధికి చెందిన మురుగేశన్ (62)- మాలతి (60) దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. మురుగేశన్ అదేప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి రూ.11 లక్షలు అప్పుగా ఇచ్చాడు. మూడు నెలల క్రితం అనారోగ్యం కారణంగా ఆ వ్యక్తి మృతిచెందాడు. అప్పు విషయమై మృతుడి కుటుంబ సభ్యులను మురుగేశన్‌సంప్రదించగా, ఆయన అప్పు తీసుకున్న విషయం తమకు తెలియదని, ఆయనే వద్దకే వెళ్లి తీసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు సమాచారం. దీంతో మనస్తాపం చెందిన దంపతులు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సూసైట్ నోట్ స్వాధీనం చేసుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టారు.



మాలతి, మురుగేశన్ (ఫైల్‌ఫొటో)

రేషన్ దుకాణం ప్రారంభించిన మంత్రి



రేషన్ దుకాణం ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, సెప్టెంబరు 22: స్థానిక కేవీకుప్పం పంచాయతి అనైత్తు గ్రామ మరుమలార్చి ప థకం కింద రూ.8.67 లక్షలతో కొత్తగా నిర్మించిన పార్ట్‌టైం రేషన్ దుకాణం (కో-ఆపరేటివ్)ను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. కార్యక్రమంలో వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు సీతారామన్, పంచాయతి మండ్రం అధ్యక్షుడు బాలచెట్టు, కో-ఆపరేటివ్ సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ తిరుమణ అయ్యప్పదొరై, ఉప రిజిస్ట్రార్ స్వాతి పాల్గొన్నారు.

ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం



ఉచిత శిబిరం ఏర్పాటుచేసిన దృశ్యం

వేలూరు, సెప్టెంబరు 22: గుడియాత్తం ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. డీపీ నోవా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డా.ఆశాజోవిత్, అధ్యక్షుడు డా.సెల్వరాణి, సెక్రటరీ జయంతి జగన్నాథన్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా శాంతి మోహన్, పంచాయతీ మండ్రం అధ్యక్షుడు రాశి, దళిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. వైద్యపరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా సిద్ధ మందులు అందజేయడంతో పాటు వైద్య సలహాలు అందించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



జస్టిస్ కృష్ణకుమార్, జస్టిస్ దండపాణి

తిరుమల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం తమిళనాడు హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ డీ కృష్ణకుమార్,న్యాయమూర్తి జస్టిస్ దండపాణి, ఎమ్మెల్యే కూన రవికుమార్, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్ దర్శించుకున్నారు.

ముక్కంటి సేవలో నటి నమిత



రాహు కేతు పూజలు జరుపుకుంటున్న హీరోయిన్ నమిత దంపతులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని హీరోయిన్ నమిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని సహస్ర లింగం వద్ద ఆమె రాహు కేతు సర్పదోష నివారణ పూజలను చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

కమల్‌హాసన్‌కు సీఎం శుభాకాంక్షలు

పెరంబూర్, సెప్టెంబరు 22: మక్కల్ నీతి మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షులుగా మళ్లీ ఎన్నికైనందుకు, విజయవంతమైన రాజకీయ ప్రయాణం చేయాలని నటుడు కమల్‌హాసన్‌కు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో... హేతుబద్ధమైన ఆలోచనలతో, సమతావాదంతో పనిచేస్తున్న నా ప్రియ మిత్రుడు కమల్ హాసన్ మళ్లీ ఎంఎన్ఎం అధ్యక్షులుగా ఎన్నికైనందుకు ఆయనకు నా శుభాకాంక్షలు. ఆయన రాజకీయ ప్రయాణం మరింత విజయవంతం కావాలంటూ సీఎం పోస్ట్ చేశారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

చిల్లకూరు, సెప్టెంబరు 22: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా సమీపంలో ఆదివారం వేకువజామున గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... తమిళనాడులోని సేలం జిల్లా కట్టుబొట్టాయ్ గ్రామానికి చెందిన లారీడ్రైవర్ మురుగవేల్(35), అతని బావమరిది మణికందన్ సేలం నుంచి కోల్‌కతాకు టెంకాయల లోడు బయలుదేరారు. బూదనం టోల్‌ప్లాజా వద్ద ఆపి లారీపై కప్పిన పట్టను సరి చేసుకుని తిరిగి మళ్లీ బయలుదేరడానికి సిద్ధమయ్యారు. ఇంతలో మురగవేల్ గుండెనొప్పిగా ఉందంటూ అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరీనాలో ఎయిర్‌షోకు విస్తృత ఏర్పాట్లు



మెరీనా సర్వీస్‌రోడ్డులో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ కోసం తెప్పించిన వాహనాలు

అడయార్, సెప్టెంబరు 22: స్థానిక మెరీనా తీరంలో ఎయిర్ షో నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు సాగుతున్నాయి. దీనికి అవసరమైన ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్, ఇతర అత్యాధునిక పరికరాలతో ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు సిబ్బంది నిమగ్నమైవున్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి యేటా అక్టోబరు ఎనిమిదో తేదీ ఎయిర్ ఫోర్స్ డే నిర్వహించడం ఆనవాయితీ. ఈ యేడాది 98వ ఫౌండేషన్ డేను నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా ఈ నెల 6వ తేదీ చెన్నై నగరంలోని మెరీనా తీరంలో ఎయిర్ షో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన 72 విమానాలు ఈ ఎయిర్ షోలో పాల్గొననున్నాయి. ఈ ఎయిర్ షోకు ఎలాంటి ఆటంకం లేకుండా, విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా, సాహసక్రీడల్లో పాల్గొనే విమానాలకు సిగ్నల్స్ అందేలా విస్తృత ఏర్పాట్లతో పాటు అత్యాధునిక ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఎయిర్ షోను నగర వాసులు ఉచితంగా వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. దీంతో ఈ యేడాది ఈ ఎయిర్ షోను దాదాపు 15 లక్షల మంది తిలకిస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



వేలూరు సమీపం కాట్పాడి తాలూకా తిరువలమ్ బస్టాండ్ సమీపంలో జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ప్రచారం వీక్షిస్తున్న ప్రజలు



రజనీతో జోడికడతానని
కలలోనూ అనుకోలేదు

● దుషార విజయన్

సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి సినిమాలో నటిస్తానని కలలో కూడా ఊహింపలేదని యంగ్ హీరోయిన్ దుషార విజయన్ అన్నారు. 'వేట్టయన్' చిత్రంలో రజనీతో కలిసి నటించిన అనుభవంపై ఆమె స్పందించారు. 'రజనీ సార్‌తో కలిసి నటిస్తానని ఎన్నడూ ఊహించలేదు. ఇదొక దైవాశీర్వాదంగా భావిస్తున్నాను. ఈ సినిమాలో నటిస్తూ ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. నా కంటే సీనియర్లతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో కూడా మంచి పాత్రల్లో నటించాలని ఉంది. 'సర్పట్టా పరంబరై' చిత్రంలోని నా పాత్రకు అనేక ప్రశంసలందాయి.ఈ చిత్రం తర్వాత అవకాశాలు వస్తున్నప్పటికీ మంచి కథా పాత్రలను ఎంచుకుంటూ ముందుకుసాగుతున్నాను. అలాంటి వాటిలో 'వేట్టయన్' పాత్ర ఒకటి. ఈ సినిమా విడుదల కోసం ఎదురు చూస్తున్నాను' అని పేర్కొన్నారు.

మళ్ళీ సైంధవి మా ఇంటికి రావాలి

● ఏఆర్ రెహానా



సైంధవి, జీవీ ప్రకాష్, ఏఆర్ రెహానా

మా కోడలు సైంధవి మళ్ళీ మా ఇంటికి రావాలని, తన కుమార్తె కంటే సైంధవితోనే తాను ఎక్కువగా మనసువిప్పి మాట్లాడతానని ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ తల్లి ఏఆర్ రెహానా చెప్పారు. తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన కుమారుడు జీవీ ప్రకాష్ కుమార్, కోడలు సైంధవి విడాకుల అంశంపై స్పందించారు. 'జీవీ ప్రకాష్, సైంధవి ఒక్కటి కావాలని అనుకున్నారు. ఇపుడు విడిపోవాలని వారే నిర్ణయం తీసుకున్నారు. వారిద్దరు కలిసి ఉంటే నేను వేరు చేయడం సాధ్యమా? విధి అనేది ఉంది. ఇపుడు నేను వెళ్ళి వారిద్దరూ కలిసి ఉండాలని బలంగా కోరుకుంటున్నాను. సైంధవి ఒక అద్భుతమైన మహిళ. నా కొడుకు కూడా చాలా విషయాల్లో సర్దుకుపోయాడు. కానీ, ఈ విషయంలో ఏం జరిగిందో నాకు తెలియలేదు. ఏదిఏమైనా సైంధవి ఇంటికి రావాలని నేను కోరుకుంటున్నాను. ఆమె ఒక మంచి అమ్మాయి. ఈ విషయంపై నా కుమారుడు వద్ద కూడా మాట్లాడాను. వీరిద్దరి విడాకులను జీర్ణించుకోలేకపోతున్నా. ఇక ఈ విషయాన్ని దేవుడికే వదిలివేస్తున్నా. వారిద్దరూ కలిసి ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని పేర్కొన్నారు.



చిత్రజ్యోతి

భార్యను గౌరవించలేనివాడు...

● ఖుష్బూ ట్వీట్



భార్యను గౌరవించనివాడు ఇతరుల మర్యాద పొందలేడంటూ సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ ఘాటుగా విమర్శించారు. ఈ విషయంపై ఆమె తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. 'ఒక వ్యక్తి తన కుటుంబాన్ని సమాజంలో ఉన్నతంగా ఉంచాలనుకుంటాడు. ప్రేమించిన వారికి తొలి స్థానాన్ని ఇస్తాడు. ప్రతి విషయంలోనూ ఎత్తుపల్లాలు సహజం. చిన్న చిన్న తప్పులు కూడా జరుగుతుంటాయి. ఇంత చిన్న విషయాలకే బంధాన్ని వదులుకోవాల్సిన అవసరం లేదు. ప్రతి వ్యక్తి తన భార్యకు తగిన గౌరవాన్ని ఇవ్వాలి. జీవితం చాలా అందమైనది. కొన్నిసార్లు తీసుకునే నిర్ణయాల వల్ల పశ్చాత్తాపపడాల్సి వస్తుంది. కాకపోతే ఆలస్యం కావొచ్చు. నిన్ను ప్రేమించిన, నీకు తోడుగా నిలబడిన వ్యక్తిని అగౌరవపరచడం బాధాకరమైన విషయం. గౌరవం అనేది కుటుంబం నుంచి మొదలుకావాలి. ఈ ప్రాథమిక సూత్రాన్ని మరచిపోయిన వ్యక్తి ప్రేమకంటే విలువైన బంధాన్ని, నిజమైన ఆనందాన్ని కోల్పోయినట్టే' అని ఆమె పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఖుష్బూ వ్యాఖ్యలను గమనించిన నెటిజన్లు అవన్నీ ఇటీవల సినీ హీరో జయం రవి తన భార్య ఆరతికి విడాకులు ఇవ్వనున్నట్లు చేసిన ప్రకటనపై ఉద్దేశించి చేశారని చెబుతున్నారు. ఆరతి తల్లి సుజాత, ఖుష్బూ చిరకాల స్నేహితులు. జయం రవి, ఆరతి వివాహాన్ని ఖుష్బూ, ఆమె భర్త సుందర్ దగ్గరుండి జరిపించారు. ఈ నేపథ్యంలోనే జయం రవిని ఉద్దేశించి ఖుష్బూ ఈ వ్యాఖ్యలు చేసినట్లు నెటిజన్లు భావిస్తున్నారు.

వర్షాకాలంలో 'కంగువా' చిత్రం విడుదలా?

● సూర్య ఫ్యాన్స్ ప్రశ్న



'కంగువా'లో సూర్య

దర్శకుడు చిరుత్తై శివ - హీరో సూర్య కాంబినేషన్‌లో పదికిపైగా భాషల్లో రూపుదిద్దుకున్న చిత్రం 'కంగువా'. సూర్య, దిశా పఠానీ, బాబీ డియోల్ తదితరులు నటించారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా భారీ బడ్జెట్‌తో నిర్మించారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని అక్టోబరు 10న విడుదల చేయాలని భావించారు. కానీ, ఆ రోజున సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'వేట్టయన్' చిత్రం విడుదలకానుంది. దీంతో 'కంగువా' విడుదల వాయిదా వేశారు. ఆ తర్వాత ఎపుడు విడుదల చేయాలన్న అంశంపై దర్శక నిర్మాతలు చర్చలు జరిపి చివరగా నవంబరు 14న విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే, రాష్ట్రంలో అక్టోబరు నుంచి డిసెంబరు నెల వరకు మూడు నెలల పాటు వర్షాకాలం. ఈ సమయంలో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫానులతో రాష్ట్రం భారీ వర్షాలతో అతలాకుతలమవుతుంది. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో 'కంగువా' చిత్రాన్ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు విడుదల చేయాలని భావించడం పెద్ద సాహసమని చెప్పొచ్చు. సాధారణ రోజుల్లోనే థియేటర్‌కు ప్రేక్షకులు రావడం లేదు. అలాంటి వర్షాకాలంలో ప్రేక్షకులు థియేటర్ల వైపు కన్నెత్తి కూడా చూడరు. అలాంటిది వర్షాకాలంలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని ఎలా నిర్ణయం తీసుకున్నారంటూ సూర్య ఫ్యాన్స్ ప్రశ్నిస్తుంది.

డ్రైవర్ రహిత తొలి మెట్రో రైల్ సిద్ధం



డ్రైవర్ రహిత మెట్రో రైలు ప్రదర్శనలో సీఎంఆర్ఎల్ ఎండీ రాజేష్ చతుర్వేది, సీజీఎం అనిల్ కుమార్ షైనీ,

అడయార్, సెప్టెంబరు 22: డ్రైవర్ రహిత మెట్రోరైల్‌ను ఆల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్టు సంస్థ తయారు చేసింది. చెన్నై మెట్రోరైల్ ప్రాజెక్టులో భాగంగా, మెట్రోరైల్ బోగీలను అందించేందుకు వీలుగా ఆల్‌స్టోమ్ కంపెనీతో సీఎంఆర్ఎల్ గతంలో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు మొత్తం 108 మెట్రోరైల్ బోగీలను తయారు చేసి అప్పగించనుంది. ఇందుకోసం రూ.1215.92 కోట్ల మేర ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా డిజైన్, ప్రొడక్షన్, టెస్టింగ్, సిబ్బందికి శిక్షణ, విడి భాగాల పంపిణీ, లోపాల సరిచేయడం వంటి అనేక అంశాలున్నాయి. ఏపీలోని తడలో ఉన్న శ్రీసిటిలో ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పి, ఫిబ్రవరి నుంచి ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ నేపథ్యంలో డ్రైవర్ రహిత మెట్రో రైల్ తయారు చేసి, ట్రయల్ రన్‌కు సిద్ధం చేసింది. ఈ రైలుకు అన్ని రకాల టెస్టింగ్‌లు పూర్తి చేసి సిద్ధంగా ఉంచింది. ఆ తర్వాత రెండో దశ టెస్టింగ్ కూడా విజయవంతంగా పూర్తి చేసింది. ఆ తర్వాత న్యాయపరమైన అనుమతులు మంజూరైన వెంటనే ఈ రైలును పట్టాలపైకి ఎక్కిస్తామని మెట్రో రైల్ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రత్యేక చర్యల విభాగం ముఖ్య కార్యదర్శి హర్‌సహాయ్ మీనా, సీఎంఆర్ఎల్ ఎండీ రాజేష్ చతుర్వేది, చీఫ్ జనరల్ మేనేజర్ అనిల్ కుమార్ షైనీ, ఆల్‌స్టోమ్ కంపెనీ చెన్నై విభాగం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముత్తారమ్మన్ ఆలయానికి పోటెత్తిన భక్తులు

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా ఉడన్‌కుడి సమీపంలోని కులశేఖరపట్టినం ముత్తారమ్మన్ ఆలయంలో ఆదివారం ఉదయం దసరా వేషాలు వేసే భక్తుల సందడి ఆరంభమైంది. దసరా ప్రత్యేక వ్రతమాచరించేందుకు పూజారి చేత మాలలు ధరించేందుకు బారులు తీరారు. ఈ ఆలయంలో దసరా ఉత్సవాలు అక్టోబర్ 3న ధ్వజారోహణంతో ప్రారంభమవుతున్నాయి. 13 రోజులపాటు జరిగే ఈ వేడుకలకు దేశవిదేశాల నుండి లక్షలాది మంది భక్తులు విచ్చేయనున్నారు. ఈ వేడుకలలో వేల సంఖ్యలో భక్తులు వివిధ దేవతామూర్తుల వేషాలతో సందడి చేయనున్నారు. ఇలా వేషధారణలతో వేడుకల్లో పాల్గొననున్న భక్తులంతా ఆలయానికి వెళ్ళి సముద్రస్నానమాచరించి ఆలయ పూజారి ద్వారా వ్రతమాలలు ధరించటం ఆనవాయితీ. ఆ మేరకు ఆదివారం ఉదయం భక్తులు ముత్తారమ్మన్ ఆలయానికి చేరుకున్నారు. సముద్రతీరం వద్ద, ఆలయం వద్ద భక్తులు సందడి చేశారు. ఆలయమండపం అంతా వ్రతమాలలు ధరించేందుకు విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది.





పురస్కారగ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'ఉపాధ్యాయ దినోత్సవం'

పెరంబూర్, సెప్టెంబరు 22: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టి.నగర్‌లోని సర్ పిట్టి త్యాగరాయ ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. కార్యక్రమానికి లయన్ పెన్స్ విజయరాఘవన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్.వరదరాజన్, మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జ్యోతిమణి హాజరై, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు బోస్, రాజేష్ జోషి, మీనాక్షి సుందరం, శేఖర్, సుందరవర్ధన్ చెల్లప్ప, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నైపురి దేవాంగసంఘం ఆధ్వర్యంలో
విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ

ప్యారీస్, సెప్టెంబరు 22: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెన్నపురి దేవాంగ సంఘం నిర్వహణలో జరిగిన ఉపకారవేతన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు అభిప్రాయపడ్డారు. పాత చాకలిపేటలోని చెన్నపురి దేవాంగ సంఘం ప్రధాన కార్యాలయంలో ఆదివారం దేవాంగ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరుతో విద్యలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులతో పాటు పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేశారు. సంఘ అధ్యక్షులు కోనంకి జనార్దనం ఆశీస్సులతో ఉపాధ్యక్షులు డీవీ తారాచంద్రన్, ప్రధాన కార్యదర్శి జి.రము, నిర్వాహకులు యారాసి యుగంధర్, వి.భరణి, ఎం.మునిరత్నం, కార్యవర్గ సభ్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా సర్ పిట్టి గురువప్ప యు.చంద్రప్రకాశం, ప్రముఖ సీనియర్ న్యాయవాది జక్కుల హరికృష్ణ, గోదారి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. టెన్త్, ప్లస్ టూ, డిగ్రీ, డిప్లొమో తదితర విద్యార్థినీ, విద్యార్థుల సహా మొత్తం 97 మదికి ఉపకారవేతనాలు అందజేశారు.

మెరిట్స్ స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు, అతిథులు →



మార్కెట్లోకి మహేంద్ర కొత్త కారు



మార్కెట్లోకి మహేంద్ర కొత్త కారు

వేలూరు, సెప్టెంబరు 22: స్థానిక వెంకటాపురం పుదువసూరులోని మహేంద్ర కార్స్, జైన్ కార్స్ అండ్ ఆటో సేల్స్ సంస్థలో ఆదివారం తార్‌రోక్స్ ఎస్‌యు.వి ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ నటుడు ఓఏకే సుందర్, జిల్లా ఏడీఎస్పీ తిరునావుక్కరసు, జైన్ కార్స్ మేనేజింగ్ డైరెక్టర్ సిరేమేతా, టాక్ బాలాజి, మణికంఠన్, ఏఎస్ఎం శరత్‌కుమార్, డా.బాలాజి తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

పుట్టలో పాలుపోసి మంత్రి పూజలు



పుట్టలో పాలు పోస్తున్న మంత్రి సెంజి మస్తాన్

పెరంబూర్, సెప్టెంబరు 22: విల్లుపురం జిల్లా సెంజి సమీపం టిక్కామేడు గ్రామంలో నిర్మించదలచిన రోడ్డు నిర్మాణపనులకు శనివారం మైనారటీల సంక్షేమ శాఖ మంత్రి సెంజి మస్తాన్ భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి సమీపంలోని గంగైఅమ్మన్ ఆలయానికి వెళ్లి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహం వెనుక వైపున్న పుట్టలో మంత్రి పాలు పోసి పూజలు చేశారు.



పాండ్యన్ హోటల్స్ ఎండీ వాసుదేవన్‌కు లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేస్తున్న పుదుచ్చేరి మంత్రి లక్ష్మీనారాయణన్

తమిళనాడు ట్రావెల్ ఎక్స్‌పో అవార్డుల ప్రదానోత్సవం

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంలో సేవలందిస్తున్న సంస్థలు, వ్యక్తులకు అవార్డుల ప్రదానోత్సవం మదురైలో శనివారం జరిగింది. తమిళనాడు ట్రావెల్ ఎక్స్‌పో 2024 పేరిట జరిగిన కార్యక్రమానికి పుదుచ్చేరి రాష్ట్ర ప్రజపనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణన్, కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ డి.వెంకటేశన్, మదురై సౌత్ ఎమ్మెల్యే భూమినాథన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పర్యాటక రంగంలో హోటల్స్, రవాణా, ఏజెన్సీ తదితర విభాగాల్లో విశేషంగా రాణిస్తున్న సంస్థలు, వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేశారు. అలాగే, మదురై పాండ్యన్ హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా.జి.వాసుదేవన్, చెన్నై కన్నన్ టూర్ అండ్ ట్రావెల్స్ ఫౌండర్ ఎన్.కన్నన్‌కు లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేశారు.

చెన్నైలో 'లివింగ్ లైఫ్‌స్టయిల్ ఎక్స్‌పో'

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆల్వారుపేట టీటీకే రోడ్డులోని యతిరాజ్ కల్యాణ నిలయంలో శనివారం 'లివింగ్ లైఫ్‌స్టయిల్ ఎక్స్‌పో' ప్రారంభమైంది. సీనియర్ లివింగ్ డైరెక్టర్ అశ్విన్‌కుమార్ అయ్యర్ జ్యోతిప్రజ్వలనతో ఈ ఎక్స్‌పో ప్రారంభించారు. 20 స్టాళ్లు ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పోలో వెయ్యిమందికి పైగా వినియోగదారులు పాల్గొన్నారు. వృద్ధుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన వినూత్న ఉత్పత్తులను ప్రదర్శనకు వుంచారు. ఈ సందర్భంగా అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ ఎక్స్‌పోకు అనూహ్యమైన స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.



ఎక్స్‌పో ప్రారంభోత్సవ దృశ్యం

పట్టినబాక్కంలో కడలి కోత

● ఇళ్లలోకి చొరబడిన సముద్రజలాలు



తీరంలో ఇళ్లవైపు దూసుకువస్తున్న అలలు

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టినంబాక్కంలో ఆదివారం ఉదయం సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసి జనావాస ప్రాంతాలపై విరుచుకుపడ్డాయి. దీంతో ఇళ్ల మట్టిగోడలన్నీ కడలిలో కొట్టుకుపోయాయి. ఇలా ఊహించని విధంగా అలలు దూసుకురావటంతో ఇళ్లలోని వారంతా భీతిల్లారు. సుమారు అరగంటపాటు అలలు పట్టినం బాక్కం వద్ద నివసిస్తున్న కార్మికుల ఇళ్లలోకి చొరబడ్డాయి. దీంతో ఇళ్లలో ఉన్నవారంతా భయంతో బయటకు పరుగులు తీసారు. సాయంత్రానికి అలలు యథాపూర్వస్థితికి చేరుకోవడంతో కాలనీవాసులంతా ఊరట చెందారు.



ఓ ఇంటిపై ఎగసిపడుతున్న రాక్షస అలలు

రోటరీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పురస్కారాలు



పురస్కారాలు అందజేస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, సెప్టెంబరు 22: రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో ఎక్సలెన్స్ అవార్డ్ ఫర్ ఎడ్యుకేషన్-2024 పేరిట ఉత్తమ బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రదానం ఇటీవల జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేష్ హాజరై చెన్నై కార్పొరేషన్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 100 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. అలాగే, విద్యా సేవలో రాణిస్తున్న 8 కళాశాలలకు రోటరీ ఎమినెన్స్ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మురుగానందం, ఎగ్మూర్ ఎమ్మెల్యే పరంధామన్, కెవిక్ కేర్ సీకే రంగనాధన్, రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ మహావీర్ బోత్రా తదితరులు పాల్గొని, మంత్రి అన్బిల్ మహేష్‌ను ఘనంగా సత్కరించారు.

అగర్వాల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో
'కల్పవృక్ష' ప్రారంభం



రాజేష్ లఖానీని జ్ఞాపికతో సత్కరిస్తున్న అగర్వాల్ హాస్పిటల్స్ నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 17వ విడత కల్పవృక్ష-2024 పేరిట నేత్రవైద్య విద్యార్థులకు రెండు రోజుల పోస్టుగ్రాడ్యుయేట్ సీఎంఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని సవేరా హోటల్‌లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యుత్ బోర్డు చైర్మన్ రాజేష్ లఖానీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుండి 30 మంది అధ్యాపకులు, 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్స్ క్లినికల్ సర్వీసెస్ రీజినల్ హెడ్ డాక్టర్ ఎస్.సౌందరి, డైరెక్టర్ ప్రొఫెసర్ ఆద్యా అగర్వాల్, డాక్టర్ సంతోష్ హనోవర్, డాక్టర్ ప్రీతి నవీన్, డాక్టర్ దివ్యా అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీ విండ్సర్ సీయూవీ ఆవిష్కరణ



ఎంజీ విండ్సర్ ఆవిష్కరణలో పాల్గొన్న సంస్థ నిర్వాహకులు రంజిత్‌కుమార్, శ్రీనివాసన్ తదితరులు

చెన్నై, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాల తయారీలో పేరొందిన జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ ఇండియా అంబత్తూరులో ఎఫ్‌పీఎల్ ఎంజీ డీలర్ షోరూమ్‌లో ఎంజీ విండ్సర్ పేరిట ఇంటెలిజెంట్ సీయూవీ వాహనాన్ని ఆవిష్కరించింది. నాలుగు రంగుల్లో లభించే ఈ సీయూవీ ధర రూ.13,49,800లని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా నిర్వాహకులు రంజిత్‌కుమార్, శ్రీనివాసన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు లైడియాన్ నాదేశ్వరం, నటి నందితా జెనిఫర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



షావుకారుపేట కుమరప్పమేస్త్రీ వీధిలోని ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న సంఘ నిర్వాహకులు, భక్తులు

ప్యారీస్, సెప్టెంబరు 22 : చెన్నై షావుకారుపేటలోని కుమరప్ప మేస్త్రీ వీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి సేవా సంఘం తృతీయ వార్షిక పురటాసి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు.. సీనియర్ పురోహితులు వడ్డి వెంకటేశ్వర్లు ఉదయం 8 గంటలకు గణపతి పూజతో వేడుకలు ప్రారంభించి, స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చన, అలంకారం, హారతి, ప్రసాద నివేదన నిర్వహించారు. సంఘం అధ్యక్షులు ఎ.ఆదినారాయణ, పి.మురళి, ఎస్ మల్లిఖార్జున, ఎ.దామోదరం, బి. చంద్రశేకర్, జి.అనిల్, కే రవి, పి. దయాకర్, బి. శేఖర్, టీజీ రమేష్, జి. శ్రీనివాసులు, పి. సతీష్, ఎం. సుబ్రహ్మణ్యం, చరణ్, జీ వెంగయ్య తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులందరికి అన్నదానం చేశారు.

పురటాసి మాసం ఎఫెక్ట్...
మందకొడిగా చేపల విక్రయాలు



కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌లో కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న వ్యాపారులు

ప్యారీస్, సెప్టెంబరు 22: వెంకటేశ్వర స్వామికి ప్రీతికరమైన పురటాసి మాసంలో రాష్ట్రవ్యాప్తంగా భక్తులు మాంసాహారం ముట్టకుండా నియమనిష్ఠలతో పూజలు చేస్తుంటారు. అందువల్ల రాష్ట్రంలో చేపల విక్రయాలు ఆదివారం మందకొడిగా సాగాయి. గత వారం కంటే తక్కువ ధరలకే చేపలు, రొయ్యలు, పీతలు విక్రయించారు. వారం రోజుల క్రితం రూ.1,000కి విక్రయించిన కిలో వంజరం చేప ఇప్పుడు రూ.800లకు తగ్గింది. అదే విధంగా, కొడువ రూ.700, షీలా రూ.400, పాల్ సురా రూ.350, శంకర రూ.400, కిలో రొయ్యలు రూ.350, పీతలు రూ.300, మెత్తాళ్లు రూ.100కు విక్రయం అయ్యాయని స్థానిక రాయపురం ప్రాంతంలో ఉన్న కాశిమేడు ఫిషింగ్ హార్బర్ వ్యాపారులు వాపోయారు.